# జారవిడిచిన అమృత పాత్ర

(కథానిక)

"ఎందుకీ మొసలి కన్నీళ్లు?" అని చరాలున అనేసింది ఇందిర.

చురుక్కున బాకుతో పొడిచినట్లు, ఛెళ్లున కొరడాతో చరిచినట్లు ఆ మాటలు రామదాసుని ఎంతో బాధ పెట్టినై. తల వంచుకుని అక్కడే ప్రాణంలేని ప్రతిమలాగా కూచుండి పోయాడు. అవుననటానికీ కాదనటానికీ నోరు మెదపలేక పోయాడు. కెఱటాలుగా పొంగి వస్తున్న దుఃఖంలో అతని మనస్సు సుడి తిరిగి పోయింది.

కాదు కాదు. తన విచారమంతా కపటనాటకం కాదు. తల్లిదండ్రులులేని దిక్కులేని తనను తెచ్చి ఇంట్లో కన్నకొడుకులాగా పెంచాడు ఇందిర భర్త సుందర్రావు. అండలేని తనని ఆదుకుని ఆదరించి పెంచి పెద్దవాణ్ణి చేశాడు. చదువు చెప్పించాడు. అటువంటి సుందర్రావు; అనుక్షణమూ తను "నాన్నా" అంటూ చుట్టూ తిరిగిన తండ్రి, ఆకస్మికంగా గుండె ఆగి చనిపోయాడు. అటువంటి వాత్సల్య మూర్తిని కోలుపోయి విలపిస్తున్న తన కన్నీళ్లు మొసలి కన్నీళ్ళా? ఆ మాటల్లో ఎంత కుటిలత్వం, ఎంత నిర్దయా, ఎంత స్పర్ధా! తలుచుకున్న కొద్దీ తల తిరిగిపోతోంది. గుండె మండి పోతోంది.

తను "అమ్మా" అని ఆమెకి ఎంత దగ్గరగా పోవాలనుకుంటాడో ఆమె అంత దూరంగా విదిల్చి కొడుతుంది. తను ఆమెచుట్టూ అల్లుకు పోవాలనే ప్రయత్నిస్తాడు. ఇందిరమాత్రం అతన్ని పురుగులాగా దులపరించేస్తుంది. ఇన్నాళ్ళూ సుందర్రావు చూపిన ఆదరాభిమానాలవల్లనే తను ఆ యింట్లో నిలవకలిగాడు. ఇందిర తనని ఎంత ఈసడించేదో సుందర్రావు అంత దగ్గరికి తీసేవాడు. మొన్న మొన్నటి దాకా సుందర్రావు తన కన్నతండ్రి కాదని రామదాసుకి తెలియనే తెలియదు. ఆ ఇంట్లో అడుగుపెట్టిన క్షణమే అతన్ని సుందర్రావు హృదయ మధ్యంలోకి స్వీకరించి కన్నకొడుకు కంటే మిన్నగా ప్రేమించటం మొదలు పెట్టాడు. మొదటి చూపులోనే ఎందుకో ఇందిరకి ఈ దిక్కులేని దీనుడిమీద కారణం లేని ద్వేషం అంకురించింది. ఊరుపేరు తెలియని బికారిని పెంచుకోటం తనకి సుతరామూ ఇష్టంలేదని భర్తకి నెత్తిన నోరుపెట్టుకుని చెప్పింది. ఈ దిక్కులేని పిల్లాడికి తమ ఆస్తి నంతా కట్టబెట్టటం తనకి గిట్టదనీ, ఎవరినైనా మర్యాదస్తుల పిల్లాణ్ణి కులంగోత్రం కలిసినవాణ్ణి పెంచుకుందామని ఎంతో పట్టుపట్టింది. ఏ విషయంలోనూ ఇందిర మాటని జవదాటి యెరుగని సుందర్రావు ఈ సందర్భంలో మాత్రం భార్య మాటని చెవిలో దూరనివ్వలేదు. అనాథ బాలకుడు రామదాసుమీద అతనికి అవ్యాజమైన మమకారం ఏర్పడిపోయింది. రామదాసుని భార్య చిన్నచూపు చూడటం దేనికో అర్థం కాక సుందర్రావు లోపల ఎంతో బాధ పడ్డాడు. ఆ దీనుడిమీద తన అనుగ్రహానికీ, ఇందిర ఆగ్రహానికీ కారణంలేదని గ్రహించిన సుందర్రావు రామదాసుమీద పంచప్రాణాలు పెట్టుకుని బతికాడు. తను ఇంత ఆకస్మికంగా చనిపోతానని సుందర్రావు కలలోకూడా అనుకోలేదు. ఐనా ముందుచూపు కలమనిషి కావటంచేత ఒక కాగితంమీద రామదాసు తన ఆస్తికి వారసుడని రాసి కవర్లో పెట్టి ఆ కవరు రామదాసుపెట్టె అడుగున పెట్టాడు. ఆ కాగితం రిజిష్టరు చేయించనూలేదు. రామదాసుని శాస్త్రోక్తంగా పెంచుకోనూలేదు.

సుందర్రావు హఠాత్తుగా మరణించే సరికి ఇంట్లో రామదాసుకున్న అధికారం, ఆదరం ఒక్కసారిగా మాయమైపోయినాయి. తను

"అమరేంద్ర"

[illegible]వాడని, తనకు ఆ ఇంట్లోకాని, ఆ స్త్రీతో కాని ఏమీ సంబంధంలేదని అనుక్షణమూ ఇందిర సూటిపోటి మాటలతో అంటిస్తూనే వుంది. రామదాసుకి ఆ స్త్రీమీద మమకారమే కాని సుందర్రావుమీద నిజమైన ప్రేమలేదని ఇందిర అభిప్రాయం. అందుకే అతనివి మొసలికన్నీళ్ళని అనటానికి కొంచెమైనా సంకోచించలేదు.

మొన్న చిందర వందరగావున్న గుడ్డల్ని సర్దుతూంటే అడుగునవున్న కవరు రామదాసు కళ్ళపడింది. అందులో ఏముందో అని ఆత్రంగా తెరిచాడు. ఆ స్త్రీ కంతకీ తనని అధికారిని చేస్తున్న ఆ కాగితాన్ని చూసి రామదాసు విస్తుపోయాడు. అప్రయత్నంగా అతని కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినై. ఆ కాగితాన్ని మళ్లీ భద్రంగా కవర్లోపెట్టేసి అడుగున పడేశాడు. అందులోని ప్రతి అక్షరంలోనూ చనిపోయిన సుందర్రావు హృదయస్పందం వినిపించింది. చూసినక్షణంలోనే దాన్ని తీసికెళ్ళి ఇందిరకు చూపుదామనిపించింది. కాని ఎందుకో వెనకాడింది మనస్సు. ఈ కాగితం సంగతి అసలు ఇందిరకి తెలుసునో లేదో?

ఏమో? తెలిసినంతమాత్రాన ఇప్పుడావిడ మనస్సు మారుతుందా? పైగా తనమీది అనాదరం ఇంకా రెచ్చిపోతుంది. ఆమె దృష్టిలో తను కేవలం ఆ స్త్రీ కాజెయ్యటానికి కాచుకుని కూచున్న దొంగ! అటువంటప్పుడు ఆవిడకి తన మీద మమకారం కలుగుతుందనుకోటం కలలోనిమాట. క్షణక్షణమూ ఆవిడ మాత్సర్యం పెరిగిపోతోంది. ఇంకా పెరుగుతుంది. సందేహంలేదు.

మరి తానిక ఆయింట్లో ఏ ఆసరా చూసుకుని వుండాలి? ఎందుకుండాలి? ఇన్నాళ్ళూ తనని కంటికి రెప్పగా కాచిన సుందర్రావు అండవుంది. ఆయన ప్రేమ వాత్సల్యాలు, అన్నిటినీ మరపించినై. ఆయన ఆదరాభిమానాలకి ప్రపంచంలోని ధనమంతా కలిసినా సరిపోదు. ఇన్నాళ్ళూ ఇందిరకి కంటకంగావున్నా తను ఆయింట్లోవున్నది ఆ స్త్రీకోసం కానేకాదు. ఇకముందు తానక్కడ వుండవలసింది ఆ స్త్రీకోసమేనా? అవును. ఆ స్త్రీకోసమే ఆవిడ అనే మాటలన్నిటినీ భరించి ఉమ్మేసినా తుడుచుకుంటూ తానక్కడ వుండాలి. ఆవిడ ఎంత అగౌరవం చేసినా తనని కాదనుకుని పురుగులాగా తానక్కడ బతకాలి. అంతకి తప్ప గౌరవంగా తానక్కడ బతకటానికి ఆస్కారమే లేదు.

ఈ సంగతి ప్రతిక్షణమూ రామదాసుకి స్పష్టంగా తెలిసివస్తోంది. తాను దిక్కులేనివాడు. నా అనేవాళ్లెవరూ అతనికి లేరు. అయినా అతనికి అభిమానం వేసింది. చచ్చి స్వర్గానవున్న సుందర్రావుగారి దయవల్ల పెరిగి పెద్దవాడయాడు. కొద్దో గొప్పో చదువుకున్నాడు. తను ఏకాకి. బికారి. అయినా తను వెక్కసమైపోయిన ఆయింట్లో అణిగిపడి వుండటం తలకిమించిన పనిగా తోస్తోంది. అనుక్షణమూ తనని చీదరించుకునే ఇందిరని జలగలాగా పట్టుకుని ఆ స్త్రీకోసం ఆ కొంపలో పడి వుండటం రామదాసుకి చెడ్డతలవంపుగా వుంది. ఎంత ఆలోచించినా అతనికి ఒకటేదారి కనబడుతోంది. అది ఎంత ఘోరమైన, అసాధ్యమైన మార్గమైనా అదే తనకి శరణ్యంగా కనబడుతోంది.

తెల్లవార్లూ కళ్ళల్లో వత్తులేసుకుని కూచున్నాడు. పసితనంనుంచీ తను ఆయింట్లో గడపిన రోజులన్నీ మనస్సులో గిరగిర తిరిగినై. సుందర్రావు ఫొటోకేసి చూసినప్పుడల్లా అతనికి వొళ్లు తెలియని దుఃఖం పొర్లుకొచ్చింది. ఆ ఇంట్లో ఆయనవి రెండే ఫొటోలున్నయ్. రెంటిలో చిన్న ఫొటో తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. సుందరరావు రామదాసుపేర వ్రాసిన కవరు చేత్తో పుచ్చుకుని ఎప్పుడు తెల్లవారుతుందా అని చూశాడు.

గడియారం నాలుగు కొట్టింది. కిటికీలోంచి అరుణరాగరేఖలు తూర్పుదిక్కున కనిపించినై. పక్కనున్న వేపచెట్ల గుబుర్లలోంచి పక్షుల కిలకిల ధ్వనులు వినిపించినై. పిల్లిలాగా అడుగులు వేస్తూ వాకిలిదాకా వెళ్ళాడు, గిర్రున వెనక్కి తిరిగొచ్చి ఇందిర నిద్రపోతున్న గది గుమ్మం దగ్గర నిలబడి "అమ్మా" అని పిలిచాడు.

ఉలిక్కిపడి లేచి ఇందిర "పొద్దున్నే ఏం మునిగిపోయింది? లేవగానే నీ ముఖం చూడాల్సొచ్చింది" అని విసుక్కుంటూ కళ్లు తెరిచింది.

"వెళ్తున్నానమ్మా. ఇక నా ముఖం చూపించి మిమ్మల్ని బాధించను లెండి. సెలవిప్పించండి. వెళ్ళొస్తా" అన్నాడు రామదాసు కన్నీళ్లతో పూడుకున్న కంఠంతో.

ఇందిర తన చెవుల్ని తానే నమ్మలేక పోయింది. ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి "ఎక్కడికి?" అంది.

"ఎక్కడికో నేనేం చెప్పనమ్మా? ఎక్కడున్నా మీ మేలు జన్మజన్మాలకీ మరిచిపోలేను. నాన్నగార్ని మిమ్మల్ని ప్రతి నిమిషమూ తలుచుకుంటూ ఎక్కడో పొట్ట పోసుకుంటాను" అని రామదాసు కొంచెంసేపు ఆగాడు. ఇందిర విస్మయంతో అతనికేసి రెప్ప వాల్చకుండా చూస్తూ "వెళ్తావా? నిజంగానా?" అని అడిగింది. "నిజమేనమ్మా! వెళ్ళిపోతూ మీదగ్గర సెలవు తీసుకుందామని నిద్రాభంగం చేశాను మీకు. క్షమించండి. ఇదిగో ఈ కవరు మీదగ్గర భద్రంగా అట్టే పెట్టండి. నాన్నగారు దయతో నాకిచ్చినా, వారి ఆస్తితో నాకేమీ ప్రమేయం లేదు. వారు నన్ను పెంచి పెద్దవాణ్ణి చేసి చదువు చెప్పించారు. నాకంతే చాలు" అని వెళ్లటానికి ఒక అడుగు ముందుకి వేశాడు. దీపం పెద్దది చేసి ఆ కవరు విప్పి కాగితాన్ని ఇందిర ఆత్రంగా చదివేసి "ఆగు, రామదాస్" అని కేక వేసింది.

"మరచిపోయానమ్మా! ఇదుగో నాన్నగారి చిన్న ఫోటో మిమ్మల్నడిగి తీసుకుపోదామనుకున్నాను" అన్నాడు రామదాసు క్షణంసేపు ఆగి.

"వెళ్ళిపోతావా రామదాస్? అయితే నీ పెట్టెకూడా తీసుకుపోవా?" అంది ఇందిర.

"వొద్దమ్మా వొద్దు. మీ మేలు జన్మజన్మాలకీ మరిచిపోలేను. దయుంచండి. వెళ్ళొస్తా" అని చేతులు జోడించి గబగబా బైటికి వెళ్ళిపోయాడు.

ఇందిర అక్కడే నిలబడిపోయింది. కాళ్ళ కింద నేల అణగారిపోతున్నట్లనిపించింది. లేశం కూడా ద్వేషంలేని రామదాసు ప్రశాంత గంభీర స్వరం ఆమె గుండెల్లో గింగురుమంటున్నది. కపటంలేని కల్మషంలేని అతని చిరునవ్వు ఆవిడ మనస్సుకు ఆగ్నేయాస్త్రంలాగా తాకింది. అప్రయత్నంగా "రామదాస్!" అని పిలిచింది. మాటలేని ఆ పిలుపు దొడ్లో లేగ దూడల "అంబా" అనే అరుపుల్లో కలిసిపోయింది.

* * *

"ఎందుకమ్మా, ఇందిరమ్మా! ఊరికే కాలయాపన చేస్తావ్?" అంది పొరుగింటి సరస్వతమ్మ.

"బాగుంది మీరు చెప్పేది! నాదేనేమిటి ఆలస్యం?" అంది ఇందిర.

"కాకపోతే ఇంకెవరిదీ? నువ్వు ఊఁ అంటే రేపీపాటికి అన్ని పనులూ అయిపోవూ?"

"మీ రూరికే, మాట వరసకి అంటారుగాని నిజంగా ఇస్తారేమిటి?"

"భలేదానివి, నెపం మామీద వేద్దామనా? నువ్వు ఊఁ అను. రేపీపాటికల్లా మావారిని ఒప్పించి మా చిన్నవాణ్ణి పెంపుడు చెయ్యకపోతే నా పేరు మారుపేరు పెట్టు! ఇదేమైనా కొత్త సంగతా? నీతో ఎన్నాళ్ళనుంచో చెబుతున్నా. ఆ రామదాసు పారిపోవటంతో ఇప్పుడు చిక్కు తీరిపోయిందిగదా. ఇంకెందుకమ్మా సంకోచం?"

"నాకెందుకండీ సంకోచం? మీరు నిజంగా ఇస్తే కళ్ళ కద్దుకుని పెంచుకుంటాను. అంతకంటే నాకింకేం కావాలి?" అని ఇందిర అనటమే తడవుగా సరస్వతమ్మ తూనీగలాగ ఇంటికి దూసుకుంది.

వారం తిరక్కుండే దత్తహోమం జరిగింది. కాగితాలలో అంతా బిగించుకున్నాకే సరస్వతమ్మగారు చిన్న కొడుకు చిదంబరాన్ని ఇందిరమ్మగారికి పెంపుడు ఇచ్చింది. పెంపుడు జరిగే రోజున వద్దనుకున్నా రామదాసు ముఖమే ఆవిడ మనస్సులో తొంగి తొంగి చూసింది. అన్ని రోజులూ మనవి కావనీ, ఎటు వొచ్చి ఎటు పోయినా మంచిదన్న దూరదృష్టితో ఇందిర పదెకరాల పొలంమాత్రం తన పేరున అట్టే పెట్టుకుంది. మిగిలిన పొలం పుట్రా యావత్తూ చిదంబరానికిచ్చేసింది. ఈ సంగతి తెలుసుకున్నాక సరస్వతమ్మగారి సంబరము సగం చచ్చిపోయింది. అంతా పిల్లాడికివ్వకుండా కొంత మళ్లీ తనపేర ఎందుకు పెట్టుకోవాలి? పెంపుడు జరిగిన క్షణంనుంచీ సరస్వ

తమ్మకి ఇందిరమీద ఈ విషయాన్ని పురస్కరించుకుని స్పర్థ ఏర్పడింది. ఇందిర మాత్రం ఈ విషయంలో ఎవరు చెప్పినా వినలేదు.

పెంచుకునేటప్పటికి చిదంబరానికి ఎనిమిదో యేడు. అప్పటికింకా అక్షరాభ్యాసం కాలేదు. ఎంతో ఖర్చుపెట్టి ఇందిర అట్టహాసంగా అక్షరాభ్యాసం చేసింది. పగిలే పలకలకీ, విరిగే బలపాలకీ, బళ్ళో తెచ్చే జట్టీలకీ అంతులేదు కాని, చదువుమాత్రం అంటటంలేదు. ఐదు బరులూ వచ్చేసరికి పెద్దలు దిగివచ్చారు. తరువాత ఒక్కొక్క క్లాసు దాటటం ఒక పెద్ద గండం అయిపోయింది.

చదువుమాట దేవుడెరుగు. పోనీ కుదురుగా వుంటే ఇందిర సంతోషించేది. అల్లరికీ, ఆగానికీ, అఘాయిత్యానికీ అతన్ని చెప్పి మరొకళ్ళని చెప్పాలి. గుడి గోడలెక్కి దూకటం, తోటి పిల్లల్ని చావగొట్టటం, చాటుగా ఇతర్లు కాల్చిపారేసిన ఎంగిలి బీడీలు తాగటం- చెయ్యని అల్లరిలేదు. ఇవన్నీ చూస్తూంటే ఇందిరకి ప్రాణం విసిగిపోయేది. సాధ్యమైనంతవరకూ సహించేది. ఎప్పుడైనా కోపం వచ్చి భయం చెబుదామని చెయ్యి చేసుకుంటే చిదంబరం ఇంటికి పారిపోయేవాడు. గోరంతలు కొండంతలు చేసి చెప్పేవాడు. ఇక సరస్వతమ్మ పెద్ద రాద్ధాంతం చేసి ఊరూ నాడూ యాగీచేసేది. ఆవిడ నోటి ధాటికి అంతా హడలి పోవలసిందే! ఆవిడతిట్లు నిఘంటువుల్లో కూడా దొరకవు!

ఒక్కనాడయినా చిదంబరంతనని నోరారా అమ్మా అని పిలిచిన పాపానపోలేదు. ఆ ఒక్క పిలుపుకి ఆవిడ గుండె ఝల్లుమని అన్నిటినీ క్షమించగలిగేది. చిదంబరం ఎంత పొక్కిరాయిగాడైనా ఆవిడ మాత్రం ఎప్పుడూ నాయనా బాబూ, అని ఎంతో ముద్దుగా పిలుచుకుంటుంది. తను ఎంత ఆప్యాయంగా లాలిస్తుందో వాడంత పెడసరంగా కసిరి కొడతాడు. తను ఎంత ఆదరంగా పెంచినా ఇక్కడేదో కష్టపడి పోతున్నట్లుగా ఇంటికి పారిపోయి వారాల తరబడి తల్లిదండ్రుల దగ్గరవుండి పోతాడు. తను వెళ్ళి బతిమాలిన కొద్దీ బిర్రబిగిసి కొమ్మెక్కి కూచుంటాడు. సరస్వతమ్మగారి అప్రతిహత దూషణలకి తనని గురిచేస్తాడు. అసలు చిదంబరం నోటి వెంట ఏమాట వచ్చినా కట్టెవిరిచి పొయ్యిలో పెట్టినట్లుంది. పుట్టింది మొదలు తల్లిదండ్రుల వల్లగాని, భర్తవల్లగాని మాట పడి ఎరుగని ఇందిర ఈ తిట్లకి లోలోపల కుమిలిపోయేది.

అయిదో క్లాసుతోనే చిదంబరం సరస్వతీదేవికి సలాం కొట్టేశాడు. వూళ్ళో రికామీగా హైహోడ్డు క్రాఫులు ఎగదువ్వి, ఛాతీ విరుచుకుని సిగరెట్టు తాగుతూ తిరిగే కుర్రాళ్ల జట్టుకి చిదంబరం అగ్రనాయకుడయ్యాడు. కయ్యానికి కాలుదువ్వుతూ అడ్డం వచ్చిన వాళ్ళందర్నీ చావగొట్టటం, సత్రం అరుగుమీద రావిచెట్టు నీడకింద అస్తమానమూ చీట్ల పేకాడటం, దారివెంట అందమైన ఆడవాళ్ళెవరైనా వెడుతూంటే ఈలలు వెయ్యటం, గంటల తరబడి మంచినీళ్ల చెరువులో ఈతలు కొట్టటం ఈ బృందం యొక్క నిరంతర కార్యక్రమం.

ఇవన్నీ చూచి ఇందిర లోపల మండిపోయేది. చిదంబరంతో నోరెత్తి మాట్లాడటం కూడా అసహ్యమనిపించేది. అయినా ఎన్నోసార్లు చెప్పి చూసింది. ఏమీ లాభం లేదని చెంపలు వేసుకుంది. ఒక్కనాడూ వేళకి అన్నానికి రాడు. ఇప్పుడు రెండు పూట్లా తన వేళకు తను తిని మూత పెడుతుంది. ఎప్పుడో వచ్చి చిదంబరం తనే పెట్టుకుని తింటాడు.

ఇదంతా తను చేతులారా కొని తెచ్చుకున్నది కాదా? రామదాసుని ఇంట్లోంచి తరిమివేసిన తనకి ఇది తగిన శిక్ష కాదా? ఆస్తిని గడ్డి పరకగా దులుపుకుని వెళ్ళిపోయిన రామదాసు రూపం ఎందుకో ఎప్పుడూ ఇందిర మనస్సులో మెరుస్తూనే వుంటుంది. చిదంబరం చేసే చిద్విలాసాలు చూస్తున్నకొద్దీ ఇందిరకి తనమీద తనకే రోత కలుగుతుంది. తన చేతుల్తో ఆస్తి అంతా ఈ గూండాకి అప్పగించేసింది. ఇక తను ఇష్టం లేకపోతేమాత్రం ఏం చెయ్యగలదు? పెంపుడు ఇల్లా పరిణమిస్తుందని ఎన్నడైనా అనుకుందా? కుర్రవాడి ఎర చూపించి, తన ఆస్తినంతటినీ సరస్వతమ్మ ఇలా నిలువు దోపిడీ చేస్తుందని తాను కలలోనైనా తలపోసిందా?

తను ఎవరినీ నిందించలేదు. తనే అంతకీ కారకురాలు. విత్తు నాటినవాళ్లు కోత కొయ్యటానికి వెరిస్తే ఎల్లాగు?

నలభయ్యో పడిలో అడుగు పెట్టింది ఇందిర. కాని, నూరేళ్లూ నిండినంత విరక్తిగా వుంది. చిదంబరం గుండెలమీద కుంపటిగా తయారయాడు. "ఫలానావారి పెంపుడు కొడుకు!" అని అంతా హేళనగా వేలెత్తి చూపుతున్నారు. అతనివల్లనే తమ వంశవృక్షం పూలతో, కాయలతో కలకలా పచ్చగా వుంటుందని కొండంత ఆశతో పెంచుకుంది. అటువంటి చిదంబరం తనకీ, చచ్చి స్వర్గాన వున్న భర్తకీ చెదిరిపోని మచ్చగా తయారైనాడు. ఏమి చెయ్యటానికీ పాలుపోవటంలేదు. ఈ కత్తుల బోనులోనుంచి బైటపడే దారి దొరకటం లేదు. ఈ దుర్గంధపు వాతావరణంనుంచి దూరంగా తీసుకుపోయే నావ కానరావటం లేదు. తనని తను తిట్టుకుంటూ పరితాపంతో భగ్గుమండే కన్నీళ్ళతో ఇందిర దిన మొక యుగంగా గడుపుతోంది.

ఇన్నాళ్ళూ సత్రంలో సమావేశమయ్యే బృందాన్ని తీసుకొచ్చి చిదంబరం ఇప్పుడు ఇంట్లోనే కేవణి వేస్తున్నాడు. కేరింతలూ, ఈలపాటలూ కూనిరాగాలూ, మోటు సరసాలూ ఇల్లంతా మోగిపోతున్నయ్. ఆ చీట్లాటకి పగలూ రాత్రి విరామమే లేదు.

పేకముక్కలు చకాచకా కలుపుతూ మధ్యలో "ఏయ్, మాకందరికీ కాఫీ తీసుకురా!" అని చిదంబరం ఒక పొలికేక వేశాడు. అది విని కూడా ఇందిర పలకలేదు. "నీకే చెప్పేది. నీకేమైనా చెముడా?" అని చిదంబరం మళ్లీ అరిచాడు.

కూచున్న ఇందిర త్రుళ్ళిపడి లేచి పొంగి వస్తున్న అభిమానంతో చీట్లాట జరుగుతున్న గదిగుమ్మం దగ్గరికెళ్ళి నిలబడి ఉరుముతూ "జాగర్తగా రానీ మాటలు. నేను నీకేంవ దాసీ ననుకున్నావా? ఫో ముందు. బైటికినడూ. ఈ గాడీమూకని తీసుకుని నా గడప తొక్కితే నేనూరుకోను. నడూ బైటికి" అని ఎక్కడలేని ఆవేశమూ వచ్చి అరిచింది.

క్షణంసేపు ఆట కట్టుబడిపోయింది. ఇందిర ఉగ్రస్వరూపం చూసి అంతా పిల్లులై కూచున్నారు. చిదంబరం మరుక్షణంలోనే తెప్పరిల్లుకొని "నువ్వెవరివి నాకు అడ్డురావటానికి? ఇవాళ చీట్లాడుతాం. రేపు తాగి తందనాలాడతాం. ఎల్లుండి బోగంవాళ్లని తెచ్చి తైతక్కలాడతాం. నీకెందుకు? అసలు నీకేం హక్కుంది? ఇది నాయిల్లు. ముందు నువ్వే బైటికి నడూ" అన్నాడు. అక్కడ చేరిన కుర్రాళ్ళందరూ "వారేవా, వహ్వా, సెబాస్" అని కేకలూ, ఈలలూ వేశారు. అందరిముందూ ఇందిర తల కొట్టేసినట్లయింది. ఆ క్షణంలో తల నేలకేసి కొట్టుకుని చావాలనిపించింది. అవమానంతో ఆవేశంతో ఆక్రోశంతో గజగజ వొణికిపోయింది. "పశువా! సిగ్గులేదా?" అని అరిచింది.

"తెలుస్తూనేవుంది ఎవరికి సిగ్గులేదో. ఇంతమంది మొగాళ్ళ ముందుకి రావటానికి నీకు సిగ్గుందా? ముందునడూ బైటికి నాయింట్లోంచి. ఫో అవతలకి."

అంటూ గబాగబా మీదిమీదికొచ్చాడు.

"ఆగు. తొందరపడకు. ఇదుగో ఇప్పుడే నేను వెళ్ళిపోతున్నాను లే. నీ యిష్టం వచ్చినట్టు ఊరేగు."

అంటూ ఇందిర గబగబా వెళ్ళిపోయింది.

* * *

"ఎక్కడికి వెళ్తున్నారు మీరు?" అని పక్కనే కూచున్నమనిషి అడిగింది. నుదుట చేరెడుబొట్టూ, అక్కడక్కడ నెరిసినజుట్టూ, సంతృప్తి తొణికే ముఖమూ.

"యాత్రలకి బయలు దేరానండీ" అంది ఇందిర.




“మళ్ళీ ఎన్నాళ్ళకి ఇంటికి తిరిగి వెళ్తారు? ఎందుకో బయలుదేరిన దగ్గర్నుంచీ నా మనస్సు ఇంటిమీదే వుందమ్మా!”

“చేతులో డబ్బున్నంత కాలం ఒంట్లో ఊపిరున్నంత కాలం యాత్రలు చేద్దామనుకుంటున్నానండి!” అంది ఇందిర విరక్తితో.

“నా కంత నిబ్బరంలేదమ్మా! అప్పుడే మనస్సు పీకుతోంది. వారెల్లావున్నారో? మా పెద్దవాడెల్లావున్నాడో? చిన్నవాడు బళ్ళోకి పోతున్నాడో లేదో. మా అమ్మాయి కొడుకు అక్షరాభ్యాసంనాటికి తప్పక రమ్మని రాసింది. గంగాస్నానంచేసి తిరుగు రైల్లో వెళ్ళిపోతాను. అయితే మరి నీకు పిల్లలెందరమ్మా?”

“నాకు బిడ్డా పాపా ఎవ్వరూ లేరండి” అని ఇందిర చాటుగా కళ్ళు తుడుచుకుంది. ఆమెని వెనక్కి గుంజుతున్నట్లు తనను బలంగా లాగే అనుబంధంలేదు. తన కెవరూ లేరు. తన హృదయం ఎడారి. తన జీవితం విలువలేని మరుభూమి. అల్లా మనస్సు శూన్యంగా బరువుగా తోచినప్పుడు భర్తని తలుచుకుంటుంది. తలుచుకోగానే ఎందుకో తెలియకుండా రామదాసుగూడా గుర్తుకొస్తాడు. ఆ స్మృతి ఆమెనెంతో వేధించి బాధించుతుంది.

“మీ టికెట్ ఏది?” అంటూ ఎవరో ఖాకీ సూటుతో హ్యాటుతో పెట్టెలోవున్న అందరినీ తనిఖీ చేస్తున్నాడు. ఇందిర చేతి సంచీలో పర్సులో పెట్టిన టికెట్ బైటకి తీసి చేతులో పుచ్చుకుని కూచుంది.

“అమ్మగారూ! నమస్కారం. మరిచిపోయారా? నేను రామదాసుని. ఎక్కడికి వెళ్తున్నారు?” అని ఎంతో ఆప్యాయంగా అడిగాడు.

ఇందిర విస్మయంతో వెలతెలబోయింది. తన్నుకున్నా నోటమాట రావటంలేదు. గుండె దడదడ కొట్టుకుంటోంది. రామదాసు ముఖం చూడలేని చిన్నతనం ఒకపక్క, జన్మలో తిరిగి చూడలేననుకున్నా అతన్ని కలుసుకోగలిగానని పారవశ్యం ఒక పక్క ఆమె హృదయాన్ని మథించివేసినై. ఎంతో సేపటికి అతి ప్రయత్నంమీద “బాగున్నావా రామదాస్?” అని అడిగింది. “మీ దయవల్ల బాగున్నానమ్మా. మా యింట్లో మీరు తప్పకుండా దిగి ఒక రోజుండి వెళ్ళాలి. నా మాట తీసెయ్యకండమ్మా” అని బతిమాలుకున్నాడు.

అమ్మా అన్న పిలుపుకోసం తపించిపోయిన ఆమె హృదయం మీద ఈ మాటలు పన్నీటి జల్లులాగా సోకినై. “ఓ తప్పకుండానూ. దిగటమే కాదు. నువ్వు వెళ్ళమనేదాకా వెళ్ళనే వెళ్ళను తెలుసా?” అంది ఇందిర చిరునవ్వుతో.

“అయితే అసలు మిమ్మల్ని ఇక్కడనుంచి ఎప్పుడూ వెళ్ళనివ్వం, అమ్మా! అయినా అంత అదృష్టం నా కెక్కడిదమ్మా? దిగండి. ఈ వూళ్ళోనే మా కాపరం” అన్నాడు.

పక్కన కూచున్న మనిషితో వెళ్ళొస్తానని చెప్పి ఇందిర దిగిపోయింది. స్టేషను దగ్గిరే ఒక చిన్న రెండు గదుల ఇల్లు. “పాపా! మామ్మగారొచ్చారు. ఒసేయ్! త్వరగా కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు తీసుకురా!” అని రామదాసు కేకవేశాడు.

వేడినీళ్ళ స్నానం, పంచ భక్షపరమాన్నాలతో భోజనం, మామ్మగారూ అంటూ చుట్టుకుని తిరిగే రామదాసు కూతురూ, అమ్మా, అంటూ ఆప్యాయంగా పిలిచే రామదాసూ, అత్తగారూ అంటూ ఆదరంగా అన్నీ అందించే కోడలూ ...

పడుకోగానే ఎన్నాళ్ళనుంచో రాని నిద్ర ఇట్టేవచ్చి ఇందిరని ముంచివేసింది. చేతులారా జారవిడిచిన అమృతపాత్రని ఎవరో తెచ్చి తన పెదవులకి అందించినట్లు ... ఏదో అనంద జగత్తుకి సోపానాలెక్కిపోతున్నట్లు .... తను కాళ్ళతో తన్నివేసిన స్వర్గమేవచ్చి తనచుట్టూ విసిరినట్లు ... ఏవో పీడకలలోంచి తను మేలుకొని కళ్ళు తెరిచినట్లు ... ఏమిటేమిటో వూహాలు. అల్లా ఎంతసేపు నిద్రపోయిందో ఆవిడకి తెలియదు, ఆ మధుర నిద్రలోంచి మెలకువ రాకపోయినా ఆవిడకేమీ విచారం లేదు!

ఆలోచన శక్తి లేకపోవడం తరుచు భావ స్వాతంత్ర్య మనిపించుకుంటుంది.